క్లుప్తంగా

సమతకు డాక్టరేట్



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో పరిశోధకురాలు ఎ.సమతకు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఏ ప్రాస్పెక్టివ్ స్టడీ ఆన్ రోల్ ఆఫ్ మెట్‌ఫార్మిన్ అండ్ మయో అయేనిసిటాల్ ఇన్ మేనేజ్‌మెంట్ ఆఫ్‌పాలిస్టిక్ ఒవేరియన్ సిండ్రోమ్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి సమతకు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె.రాజేందర్ తెలిపారు. కేయూ ఫార్మసీ కళాశాల డీన్ గాదె సమ్మయ్య పర్యవేక్షణలో సమత తన పీహెచ్‌డీ పూర్తి చేసింది.

ఉపాధి అవకాశాలపై దృష్టి కేంద్రీకరించాలి

వరంగల్ అర్బన్ : స్వయం సహాయక సంఘాలకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. శనివారం బల్దియా ఆవరణలోని మెప్మా కార్యాలయంలో కమిషనర్ అధికారులతో సమావేశయ్యారు. పార్సిల్ డెయిరీ తదితర అంశాలను మెప్మా అధికారులు వివరించారు. రాజీవ్ యువ వికాసం పథకం కింద యువతకు పూర్తిగా పారదర్శకంగా, వేగంగా దరఖాస్తుల ప్రాసెసింగ్ జరిగి, అర్హులైన వారికి సకాలంలో లాభాలు అందేలా చూడాలని కూడాలని కమిషనర్ సూచించారు.

31న వ్యాసరచన పోటీలు

హన్మకొండ చౌరస్తా : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈనెల 31న విద్యార్థులకు హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహిస్తున్నట్లు కాలుష్య నియంత్రణ మండలి, వరంగల్ ఈఈ సునీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం థీమ్‌ను యునైటెడ్ నేషన్స్ ప్రకటించిన నేపథ్యంలో విద్యార్థులకు భూమి, నీరు, గాలి, ప్లాస్టిక్ కాలుష్యం, శక్తి సంరక్షణ నీటి సంరక్షణ, మొక్కలు నాటడం, పచ్చదనం పెంపు కాలుష్యం నుంచి భూమిని రక్షించే అనేక అంశాలపై పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

పట్టాలిచ్చి ఇళ్లు నిర్మించాలి

న్యూశాయంపేట : వరంగల్ నగర పరిధిలోని పైడిపల్లి గుడిసెవాసులకు పట్టాలిచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరుతూ శనివారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో డీఆర్‌ఓ విజయలక్ష్మికి సీపీఐ వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, నాయకులు పనాస ప్రసాద్, ఏలేందర్, జన్ను రవి, మల్లారెడ్డిలు ఉన్నారు.

నాణ్యతా లోపంతో నిర్మాణ పనులు

ఖిలా వరంగల్ : వరంగల్ కరీమాబాద్ నుంచి రంగశాయిపేట వరకు జరుగుతున్న పాదచారి టైల్స్ పనులు అత్యంత నిస్సారంగా, నాణ్యతాలోపంగా కొనసాగుతున్నాయి. టైల్స్ సరైన విధంగా అమర్చకపోవడం, అణచివేత లేకుండా అసమంగా ఉండడం వలన పాదచారులకు ప్రమాదాలు కలుగుతున్నాయి. అలాగే సైడ్ డ్రెయిన్స్ శుభ్రత లేకుండా అర్ధసమాప్త స్థితిలో, పనులు విడిచిపెట్టబడ్డాయి. దీనిపై కమిషనర్, డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) అధికారులకు ఫిర్యాదు చేయగా నాణ్యత లోపంగా నిర్మిస్తున్న పాదచారి రహదారి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని న్యాయవాది పరశురాములు తెలిపారు.


డంపింగ్ యార్డును ఎత్తివేయాలి



ఎంపీ కావ్యకు వినతిపత్రం అందజేస్తున్న అడ్‌హక్ కమిటీ సభ్యులు

మడికొండ: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 46వ డివిజన్ మడికొండ–రాంపూర్ గ్రామాల మధ్య ఉన్న డంపింగ్ యార్డును తొలగించాలని కోరుతూ శనివారం అడ్‌హక్ కమిటీ సభ్యులు స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ డంపింగ్ యార్డుతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అనేక అనారోగ్యాలకు గురవుతున్నారని, గాలి, నీటి కాలుష్యం అవుతుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సమస్యను వివరించి సమయం తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

గుంతల పూడ్చివేత



కాజీపేట: అదాలత్ సెంటర్ రహదారిపై గుంతలు పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వాహనాలు తరచూ అదుపు తప్పి బోల్తాపడుతున్నాయి. ట్రాఫిక్ ఎస్సై రామారావు రెడిమిక్స్ వాహనాన్ని తెప్పించి కంకరపోయించి స్వయంగా రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చివేశారు. ట్రాఫిక్ పోలీసుల శ్రమను వాహనదారులు అభినందించారు.

పిల్లలకు ఆహ్లాదం.. పెద్దలకు ఫిట్‌నెస్

- ప్రశాంతతకు నిలయంగా కాజీపేట రైల్వే పార్కులు
- ఆరోగ్యమే మహాభాగ్యంగా గంటల తరబడి ఎంజాయ్ చేస్తున్న పిల్లలు



రైల్వే స్టేషన్‌రోడ్‌లోని పార్కు



డీజిల్‌కాలనీ పార్కులో ఆడుకుంటున్న పిల్లలు

కాజీపేట రూరల్ : ఇంటిల్లిపాది ఇంట్లో ఉంటూ ఎవరి బిజీలో వారు ఉంటూ ఒకరినొకరు ప్రేమానురాగాలతో మాట్లాడుకోలేని నేటి ఆధునిక జీవన విధానంలో ఆరోగ్యం..ఆహ్లాదకరం..వ్యాయామం. సంతోషంతో ఉండాలని రైల్వే కార్మిక కుటుంబాలు తమ పిల్లలతో కలిసి రైల్వే పార్కుల్లో గంటల తరబడి ఉంటున్నారు. దక్షిణమధ్య రైల్వే అధికారులు రైల్వే కార్మికుల కుటుంబాల కోసం చక్కటి గ్రీనరీ, మొక్కలు, చెట్లను పెంచారు. లక్షలు వెచ్చించి డీజిల్ కాలనీలో ఓపెన్ జిమ్ అండ్ చిల్డ్రన్ పార్క్, కడిపికొండ బ్రిడ్జి నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్డుమార్గంలో చిల్డ్రన్ పార్క్ అండ్ ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేశారు. ఈ పార్క్‌లో ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకు రైల్వే కార్మిక కుటుంబాల కోసం ఉచితప్రవేశం కల్పించారు. పార్క్‌ల నిర్వహణ అంత రైల్వేశాఖ చూసుకుంటుంది. డీజిల్‌కాలనీ, స్టేషన్ రోడ్‌లోని రెండు పార్కుల్లో పిల్లలు, పెద్దల కోసం వీటిని ఏర్పాటు చేశారు. రైల్వే కార్మికుల కుటుంబాలు తమ పిల్లలతో పార్క్‌కు వచ్చి పిల్లలను ఆట వస్తువుల వైపు పంపించి, పెద్దలు తమ ఆరోగ్యం కోసం ఓపెన్ జిమ్ పరికరాలపై వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. పెద్ద వారు ఇంట్లో పిల్లలు కొన్ని గంటల పాటు అయిన సెల్‌ఫోన్లు చూడకుండా బయటి వాతావరణాన్ని చూపించాలని, ఆరోగ్యం, శారీరకంగా, మానసికంగా తయారు కావాలని పార్కులకు తీసుకవచ్చి ఆటలు ఆడిపిస్తున్నట్లు పిల్లల తల్లిదండ్రులు అంటున్నారు.

పూడికతీత నిర్లక్ష్యంపై మేయర్ ఆగ్రహం

- రాజాజీనగర్ వద్ద నాలాలో వెంటనే మట్టి తొలగించాలని ఆదేశం
- సెంట్రింగ్ తొలగించకపోవడంపై కాంట్రాక్ట్ సంస్థపై అసహనం
- నాలాను సందర్శించిన మేయర్

సాక్షి ఎఫెక్ట్..



రాజాజీనగర్ వద్ద నాలాను పరిశీలిస్తున్న మేయర్ సుధారాణి, కార్పొరేటర్ స్వాతి

హన్మకొండ: నాలాలో పేరుకు పోయిన పూడికతీత తను, కాంట్రాక్టర్లు నీటి మళ్లింపు కోసం వేసిన మట్టి కట్టను తొలగించకపోవడంపై బల్దియా మేయర్ గుండు సుధారాణి అసహనం వ్యక్తం చేశారు. హనుమకొండ రాజాజీనగర్‌లో బ్రిడ్జి నిర్మాణం పూర్తయినా నీటి మళ్లింపు కోసం వేసిన మట్టి కట్టను తొలగించలేదని సాక్షిలో 'బ్రిడ్జి నిర్మాణం పూర్తయినా' అనే శీర్షికతో శనివారం కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి మేయర్ సుధారాణి, ఇంజనీర్లతో సహా హనుమకొండలోని రాజాజీ నగర్‌కు చేరుకుని నాలాను, నిర్మాణం పూర్తి చేసుకున్న బ్రిడ్జిని పరిశీలించారు. నాలాలో మట్టి అలాగే వదిలేయడం, సెంట్రింగ్ తొలగించకపోవడంపై బ్రిడ్జి నిర్మించిన కాంట్రాక్ట్ సంస్థ ఎంఐహెచ్ ప్రతినిధిపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మట్టితో పాటు సెంట్రింగ్ తొలగించాలని ఆదేశించారు. అదే విధంగా నాలాకు ఇరువైపులా సైడ్ రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్న కాంట్రాక్ట్ సంస్థ ఎస్‌వీఎస్ కంపెనీ బాధ్యుడు రవీందర్ రెడ్డికి ఫోన్ చేసి నాలా మధ్యలో వదిలేసిన మట్టిని వెంటనే తొలగించాలని సూచించారు. మేయర్ వస్తూనే హిటాచీని రప్పించి నాలాలో ఉన్న గుర్రపుడెక్క, పనికిరాని మొక్కలను తొలగింపజేయించారు. 52వ డివిజన్ కార్పొరేటర్ చాడా స్వాతి కలుగజేసుకుని నాలాలో మట్టి కుప్పలు, కుప్పలుగా పేరుకుపోయాయని, మట్టి తొలగించి నాలా మొత్తం శుభ్రం చేయాలని మేయర్‌ను కోరగా స్పందించిన మేయర్ మూడు రోజుల్లో నాలాలో పూడికతీతతో పాటు కాంట్రాక్ట్ సంస్థలు నీటి మళ్లింపు కోసం వినియోగించిన మట్టిని తొలగించి వరద నీరు దిగువకు సులువుగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని మహానగర పాలక సంస్థ ఎస్‌ఈ శ్రీనివాస్, ఈఈ టి.రవికుమార్‌ను ఆదేశించారు. ఆమె వెంట బీజేపీ రాష్ట్ర నాయకుడు చాడా శ్రీనివాస్ రెడ్డి, వరంగల్ మహానగర సంస్థ డీఈ సారంగం, ఏఈ మేనక, వర్క్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ, సెంట్రింగ్ మేస్త్రీ కంచర్ల ఎలీషా, తదితరులు ఉన్నారు.

డివిజన్ల పనులతో నియోజకవర్గ అభివృద్ధి

- ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మేయర్ సుధారాణి

కాజీపేట అర్బన్ : వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని ప్రతి డివిజన్‌లో అభివృద్ధి పనులు చేసి నియోజకవర్గాన్ని అభివృద్ధితో పాటు సంక్షేమంలో ఆదర్శంగా తీర్చిదిద్దుతానని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు తెలిపారు. గ్రేటర్ వరంగల్ 44వ డివిజన్ పరిధిలోని కడిపికొండలో రాజీవ్‌గృహకల్ప సముదాయంలోని మెప్మా భవనానికి రూ.41.5 లక్షల నిధులతో మరమ్మతులు, రూ.48 లక్షల నిధులతో సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్స్ నిర్మాణానికి శనివారం కొబ్బరి కాయ కొట్టి శంకుస్థాపన చేసి మాట్లాడారు. రాబోయే వర్షాకాలంలోపు నియోజకవర్గంలోని విలీన గ్రామాలను అభివృద్ధిపరిచేందుకు వివిధ మరమ్మతులను త్వరితగతి చేపట్టనున్నట్లు తెలిపారు. పార్టీలకతీతంగా అభివృద్ధికి ప్రతీ ఒక్కరు ముందుకు రావాలని తెలిపారు. అనంతరం కార్పొరేషన్ జనరల్ ఫండ్‌తో రాజీవ్‌గృహకల్ప సముదాయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎమ్మెల్యే, మేయర్ గుండు సుధారాణి పోలీస్ అధికారులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జలగం అనితరంజిత్, మాజీ కార్పొరేటర్ బస్కె శ్రీలేఖకృష్ణ, కాజీపేట ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి, సీఐ కిషన్, కాంగ్రెస్ నాయకులు రాజారపు స్వామి, సారంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, నర్మెట వెంకటరమణాగౌడ్, గంగుల శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, రాజీవ్‌గృహకల్ప, ఇందిరమ్మ కాలనీల అభివృద్ధి కమిటీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత గుట్కాల స్వాధీనం



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

మడికొండ : ప్రభుత్వం నిషేధించిన గుట్కాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు మడికొండ సీఐ కిషన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మడికొండ నెహ్రూనగర్ సమీపంలోని మహ్మద్‌చాంద్ పాషా ప్రభుత్వ నిషేధిత గుట్కాలను విక్రయిస్తున్నట్లు అందిన పక్కా సమాచారం మేరకు తనిఖీ చేయగా అతని వద్ద రూ.31.175 విలువ గల పొగాకు గుట్కాలను స్వాధీనం చేసుకొని సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కమ్యూనిటీ హాల్ నిర్మించి ఇవ్వండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న రజక సంఘం బాధ్యులు

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ పాత బస్‌డిపో ఏరియాలోని తుమ్మలకుంటలో చాకలి ఐలమ్మ విజ్ఞాన కేంద్రం (రజక కమ్యూనిటీ హాల్) నిర్మించివ్వాలని రజక సంఘం బాధ్యులు శనివారం బాలసముద్రంలోని ప్రజాభవన్‌లో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే అందుకు కావాల్సిన ప్రతిపాదనలు సిద్ధం చేసేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్పొరేటర్ స్వరూపారాణి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర రజక అభివృద్ధి సంస్థ ప్రధాన కార్యదర్శి రావుల సుదర్శన్, జిల్లా రజక సంఘం అధ్యక్షుడు రవికుమార్, సంఘం బాధ్యులు ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంజాల మల్లేశం

హన్మకొండ : భవన నిర్మాణరంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బీఆర్‌ఎస్ అనుబంధ భవన నిర్మాణ సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారుడు ఎంజాల మల్లేశం అన్నారు. కార్మిక సంక్షేమ మాసోత్సవాల్లో భాగంగా శనివారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక అనుబంధ 14 రంగాల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో మల్లేశం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదని, కార్మిక శాఖ మంత్రిని కూడా నియమించలేదని విమర్శించారు. అర్హులైన కార్మికుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు సిరికొండ భిక్షపతి, నాయకులు రవి, రఘుపతి రెడ్డి, చేరాలు, దాసు, శ్యామ్, ఎస్.సాయికుమార్, ఎండి అబ్దుల్ రజాక్ గౌస్, ఎస్.డి. సాధిక్, రాజు పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం అవసరం

- ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి



రోడ్డు వెడల్పు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, మేయర్, కుడా చైర్మన్, కలెక్టర్, కమిషనర్

హన్మకొండ చౌరస్తా: నగర అభివృద్ధి, సుందరీకరణకు ప్రజల భాగస్వామ్యం అవసరమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య, మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే లతో కలిసి శని వారం హనుమకొండలోని యాదవనగర్, పెద్దమ్మగడ్డ ప్రధాన రహదారిలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలంటే రోడ్ల వెడల్పు చేయాల్సిందే అన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నయీంనగర్ : గ్రేటర్ వరంగల్ 8వ డివిజన్ గుడిబండల్‌లో రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రెయిన్, ఆర్‌సీసీ స్లాబ్ కల్వర్ట్ నిర్మాణానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో పనులు పూర్తిచేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.

కాజీపేట: 62వ డివిజన్ రహమత్ నగర్ కాలనీలోని సీఎస్ఐ సెయింట్ జాన్స్ చర్చి ఆవరణలో శనివారం రూ.15 లక్షలతో నిర్మించనున్న ప్రహరీ నిర్మాణ పనులను వరంగల్ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి ప్రారంభించారు. పాస్టర్ విక్టర్ పాల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి ఎండీ.అంకూస్, సిరిల్ లారెన్స్, అశోక్, సాంబయ్య, కృపమ్మ, ప్రణామిక పాల్గొన్నారు.

రాష్ట్రసాధన కోసం జర్నలిస్టుల అలుపెరుగని పోరాటం

హన్మకొండ చౌరస్తా : రాష్ట్ర సాధన కోసం జర్నలిస్టులు అలుపెరగని పోరాటం చేశారని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. బాలసముద్రంలోని ప్రజాభవన్‌లో తెలంగాణ జర్నలిస్టుల ఫోరం రజతోత్సవ సంబురాల వాల్ పోస్టర్‌ను శనివారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 31న హైదరాబాద్‌లోని జలవిహార్‌లో నిర్వహించే 25 ఏళ్ల సంబురాలకు జర్నలిస్టులు తరలిరావాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ (హెచ్143), హనుమకొండ జిల్లా కమిటీ అధ్యక్షుడు మస్కపురి సుధాకర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అర్శం రాజ్‌కుమార్,రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీ ఆర్ లెనిన్, రాష్ట్ర నాయకులు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, కక్కెర్ల అనిల్‌కుమార్, పొగాకుల అశోక్, గోకారపు శ్యాం, వేణుగోపాల్, శ్రీకాంత్, అమర్ పాల్గొన్నారు.

ఏడాది చిన్నారులతో భిక్షాటన

- గుర్తించిన ఏహెచ్‌టీయూ
- చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరు
- తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

హసన్‌పర్తి: డబ్బులు సంపాదించడానికి తల్లిదండ్రులు కొత్త మార్గాన్ని ఎంచుకున్నారు. తాము భిక్షాటన చేస్తే ప్రజలు ఇవ్వడానికి నిరాకరిస్తారని భావించిన వారు చివరికి ఏడాది వయసు కలిగిన తమ పిల్లలతో భిక్షాటన చేయిస్తూ యాంటీ హ్యూమన్ ట్రాకింగ్ యూనిట్‌కు చిక్కిన సంఘటన శనివారం కేయూ ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్ వద్ద చోటు చేసుకుంది. భిక్షాటన చేస్తున్న ఆ చిన్నారులను ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ వెంకన్న వారిని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరుపర్చారు. వివరాల్లోకి వెళ్లితే... 56వ డివిజన్ గోపాలపురానికి చెందిన నలుగురు మహిళలతో పాటు రాజస్థాన్‌కు చెందిన మరో మహిళ కలిసి తమ ఏడాది వయసు కలిగిన చిన్నారులను కేయూసీ ట్రాఫిక్ జంక్షన్ వద్ద భిక్షాటన చేస్తున్నారు. అదే సమయంలో ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ వెంకన్న ఆ దారి నుంచి వెళ్తున్నారు. వెంటనే వాహనం ఆపిన సీఐ పిల్లల వద్దకు వెళ్లారు. వారితో మాట్లాడారు.

చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అప్పగింత

కాగా, ఆ పిల్లలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అప్పగించారు. ఈ సందర్భంగా పిల్లల తల్లులతో కౌన్సెలింగ్ నిర్వహించారు. కష్టపడి పనిచేసుకుటూ పిల్లలను పెంచుకుంటామని, వారితో భిక్షాటన చేయించేలేదని చెప్పారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు డాక్టర్ సుధాకర్, రాజేంద్రప్రసాద్, హైమావతి, ఏఎస్సై భాగ్యలక్ష్మీ, హెడ్ కానిస్టేబుల్ సమీయొద్దీన్, చైల్డ్ హెల్ప్‌లైన్ కో–ఆర్డినేటర్ భాస్కర్, బాలల రక్షా భవన్ సోషల్ వర్కర్ సునీత, సుజాత, రజిత, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- ఏడీఏ విజయ భాస్కర్



విత్తన షాపులో తనిఖీలు చేస్తున్న వ్యవసాయ, పోలీస్ అధికారులు

ఖిలా వరంగల్: విత్తనాల షాపుల డీలర్లు నాసిరకం విత్తనాలును విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏడీఏ విజయ భాస్కర్ హెచ్చరించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో వ్యవసాయశాఖ అధికారులు విత్తనాల నాణ్యతను పరిశీలించేందుకు శనివారం అకస్మింగా వరంగల్ రైల్వేస్టేషన్‌లోని పలు విత్తన షాపులపై వ్యవసాయ, పోలీసులు సంయుక్తంగా నాలుగు బృందాలుగా విడిపోయి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డీలర్ల వద్ద గల విత్తనాలను పరిశీలించారు. అనంతరం ఏడీఏ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి విత్తన లైసెన్స్ పొందిన డీలర్ల వద్ద నుంచే రైతులు విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు. అనుమతులు తీసుకోని వివిధ కంపెనీలకు చెందిన రూ.1,08,120 విలువైన 120 పత్తి ప్యాకెట్లు సీజ్ చేసి విక్రయించకుండా నిలిపివేశామన్నారు. నాసిరకం పత్తి,మిర్చి,మొక్క జొన్న ఇతర విత్తనాలు అమ్మకాలు చేపట్టిన, బ్లాక్ మార్కెట్‌కు తరలించి ఎక్కువ ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వారి వెంట సీహెచ్.రంజిత్, ఏఓలు రవీందర్‌రెడ్డి, యాకయ్య, హరిప్రసాద్,బాబు, విజయ్‌కుమార్, గోవర్ధన్‌రెడ్డి లలిత,సుధాకర్, పోలీసులు ఉన్నారు.

కళాశాలల మూసివేతను విరమించుకోవాలి

కేయూ క్యాంపస్ : తెలంగాణ రాష్ట్రంలోని 12 సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలను మూసివేయాలనే యోచనను ప్రభుత్వం విరమించుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. శనివారం కాకతీయ యూనివర్సిటీలోని మానవీయ శాస్త్రీయ భవనం వద్ద నిర్వహించిన ఆ విద్యార్థి సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ కేయూ ఉపాధ్యక్షుడు పురుషోత్తమ్, బాధ్యులు సాయికిరణ్, అఖిల్,నాగ్, జగదీష్, పాల్గొన్నారు.

స్వేరో స్టూడెంట్స్ ఆధ్వర్యంలో నిరసన

సాంఘిక సంక్షేమ జూనియర్ కళాశాలల గురుకులాలను మూసివేయాలనే నిర్ణయాన్ని వెనక్కితీసుకోవాలని స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వెల్తూరి సాయికుమార్ డిమాండ్ చేశారు.శనివారం ఆ గురుకులాలను ఎత్తివేయవద్దని డిమాండ్ చేస్తూ స్వేరో స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలోకేయూ గేట్‌వద్ద నిరసనతెలిపారు. కార్యక్రమంలో స్వేరో స్టూడెంట్స్ యూనియన్ నాయకులు రాజేష్, శ్రావణ్, శివకుమార్, చందు,విష్ణు, గణేష్, పృథ్వీ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఉద్యోగుల పెండింగ్ డిమాండ్లను పరిష్కరించాలి



విద్యారణ్యపురి : తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగుల పెండింగ్ డిమాండ్లను పరిష్కరించాలని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీఓ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం గెజిటెడ్ అధికారుల సంఘం హనుమకొండ జిల్లాస్థాయి సమావేశం ఐడీవోసీలోని టీజీఓ భవన్‌లో నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్న జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై తెలంగాణా ఉద్యోగ గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయ, పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రభుత్వానికి ఇప్పటికే సమర్పించిన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. టీజీఓ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షకార్యదర్శులు మురళీధర్‌రెడ్డి, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, రాంరెడ్డి, ఫణికుమార్, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాస్‌కుమార్, సెంట్రల్ అసోసియేషన్ కార్యదర్శి కిరణ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు అన్వర్‌హుస్సేన్ మాట్లాడారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

హన్మకొండ : వర్షాకాలం సమీపిస్తున్న క్రమంలో విద్యుత్ వినియోగదారులు విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్ సర్కిల్ ఎస్ఈ కె.గౌతం రెడ్డి, హనుమకొండ సర్కిల్ ఎస్ఈ పి.మధుసూదన్ రావు తెలిపారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయని రైతులు, వినియోగదారులు సొంతంగా విద్యుత్ సంబంధించిన పనులు ఎట్టి పరిస్థితిల్లో చేయకూడదన్నారు.

ఇల్లు కూల్చిన వ్యక్తులపై కేసు

ఖిలా వరంగల్ : భర్త చనిపోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఓ వితంతుకు చెందిన ఇంటిని తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసుకొని జేసీబీతో ఇంటిని కూల్చివేసిన తోటి కోడలు, ఆమె కుమారుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. 33వ డివిజన్ రైల్వేగేట్ కరీమాబాద్ రోడ్డు శాంతినగర్‌కు చెందిన దోర్నాల ఉషశ్రీ భర్త సదాశివుడు రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. నాటి నుంచి నేటి వరకు ఒంటరిగా ఉషశ్రీ ఉంటోంది. ఈనెల 19న ఉషశ్రీ ఇంటికి ఆమె కోడలు లలితా, భర్త వెంకటేశ్ ఇద్దరు చేరుకొని జేసీబీ యంత్రంతో ఇల్లును కూల్చివేశారు. శనివారం మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అధ్యాపకుల ఒకరోజు బేసిక్‌పే సాయం

కేయూ క్యాంపస్ : ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొని త్యాగం చేసిన సైనిక కుటుంబాలకు సంఘీభావం తెలియజేస్తూ వారికి సహాయార్థం కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకుల ఒకరోజు బేసిక్ పే వేతనంను అందించేందుకు ఓ లేఖను శనివారం అకుట్ అధ్యక్షుడు ఆచార్య బి.వెంకట్రామ్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ ఆచార్య ఎల్‌పి.రాజ్‌కుమార్, వీసీ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డికి, రిజిస్ట్రార్ ఆచార్య వి రామచంద్రంకు అందజేశారు. మే నెల వేతనంలో కేయూ ఒకరోజు బేసిక్ పే కలిపి రూ.3.14 లక్షలు అవుతుందన్నారు. ఈ ఆర్థికసాయాన్ని హైదరాబాద్‌లోని సైనిక వెల్ఫేర్ డైరెక్టర్‌కు అందించనున్నట్లు వారు తెలిపారు.

నిజరూప దర్శనంలో శ్వేతార్కుడు

కాజీపేట: స్థానిక స్వయంభు శ్రీశ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో శనివారం స్వామివారు భక్తులకు నిజరూప దర్శనం ఇచ్చారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు అయినవోలు రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు పంచామృతాలు, సప్తవర్ణాభిషేకాలు జరిపించారు.

పిడుగు పాటుకు గేదె మృతి

హసన్‌పర్తి: పిడుగుపాటుకు ఓ గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని దేవన్నపేటలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. గ్రామానికి చెందిన సందెల కృష్ణ తన గేదెను రోజు మాదిరిగానే చెట్టు కింద కట్టేశాడు. శనివారం ఉదయం చూడగా గేదె మృతి చెంది కనిపించింది. ఎద్దు విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందన్నారు. రైతును ఆదుకోవాలని పీఏసీఎస్ డైరెక్టర్ చుంచు విజేందర్, మాజీ సర్పంచ్ రవిలు డిమాండ్ చేశారు.

దోమల నివారణ మందు పిచికారీ

కాజీపేట : 63వ డివిజన్ ఏఆర్ఆర్ నగర్ కాలనీలో దోమల నివారణ మందును స్ప్రే చేసే కార్యక్రమాన్ని కార్పొరేటర్ విజయశ్రీ రజాలీ శనివారం ప్రారంభించారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ గోపి, పర్వీన్ సుల్తానా, వినయ్ కుమార్, స్వరూప, రాజు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నూతన కమిటీ ఎంపిక

మడికొండ : గ్రేటర్ వరంగల్ పరిధిలోని 46వ డివిజన్ మడికొండ బీఆర్ఎస్ పార్టీ నూతన కమిటీని శనివారం 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికరెడ్డి అధ్యక్షతన ఎంపిక చేశారు. డివిజన్ మడికొండ గ్రామశాఖ అధ్యక్షుడిగా పల్లపు యాదగిరి, కమిటీ మెంబర్లుగా మాచర్ల విజయ్, గోపన బోయిన రాజు, వస్కుల దేవేందర్, బుర్ర రమేష్, కాలేశ్వరపు రాజేందర్, దేవేందర్‌లను ఎంపిక చేసినట్లు ప్రకటించారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

ఏసీపీ ప్రశాంత్‌రెడ్డికి సన్మానం



కాజీపేట : కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్ రెడ్డిని శనివారం రాత్రి టీఎన్‌జీఓ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఇటీవల ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన ప్రశాంత్‌రెడ్డిని యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్‌తో కలిసి యూనియన్ సభ్యులు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

జర్నలిస్టుకు ఆర్థికసాయం

న్యూశాయంపేట : వరంగల్ ఉంటున్న ఓ ప్రముఖ దినపత్రికలో సబ్‌ఎడిటర్‌గా విధులు నిర్వహిస్తున్న మహ్మద్ ముజాహిద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఇంటికే పరిమితమైన ఆయనను తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా బాధ్యుల ఆధ్వర్యంలో శనివారం పరామర్శించి ఆర్థికసాయం అందించారు.

ఘనంగా పీసీసీ చీఫ్ జన్మదిన వేడుకలు

సాక్షి, నెట్‌వర్క్ : టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలను శనివారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో, హసన్‌పర్తి, కడిపికొండ, మడికొండలో ఘనంగా జరిగాయి. ఎమ్మెల్సీ సారయ్య, వరంగల్, హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఎర్రబెల్లి స్వర్ణ, ఎమ్మెల్యేలు రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు పాల్గొని కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు.



హన్మకొండ చౌరస్తా: కేక్ కట్ చేస్తున్న నాయిని రాజేందర్‌రెడ్డి, ఎర్రబెల్లి స్వర్ణ